నవతెలంగాణ
ఆదిలాబాద్
బుధవారం | జూన్ 05, 2024 | www.navatelangana.com

ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద పోలీసుల బందోబస్తు

ఆదిలాబాద్‌టౌన్ : ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకున్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మూడు కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎస్పీ గౌస్ ఆలం బందోబస్తును పర్యవేక్షించారు. పోలీసులకు సూచనలు చేస్తు అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. అనుమతి లేకుండా ఎవరినీ కేంద్రాల్లోకి పంపించొద్దని సూచించారు. ఎన్నికల అధికారి జారీ చేసిన పాసులను పరిశీలించిన అనంతరమే వారిని అనుమతించాలని ఆదేశించారు. సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకులా కళాశాల, టీటీడీసీ, పాలిటెక్నిక్ కళాశాలలో ఓట్ల లెక్కింపు సందర్భంగా ఈ రూట్‌లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. కేఆర్‌కే కాలనీకి వేళ్లే వారు పిట్టలవాడ మీదుగా రాకపోకలు సాగించారు.



మహిళలపై దాడులను పట్టించుకోని ప్రభుత్వాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దేశంలో రోజురోజుకూ మహిళలపై లైంగిక దాడులు, హత్యలు పెరుగుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని భారత జాతీయ మహిళ సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ముడుపు నళినిరెడ్డి ఆవేదన వ్యకం చేశారు. మంగళవారం సమాఖ్య 70వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకోని సీపీఐ కార్యాలయంలో సంఘం జెండాను ఆవిష్కరించారు. ప్రభుత్వాల తీరుకు వ్యతిరేకంగా చేపట్టాల్సిన ఉద్యమాల కార్యాచరణను రూపొందించారు. మహిళలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించినా ఎన్నికల్లో వాటిని అమలు చేయడం లేదన్నారు. 1954లో మహిళల హక్కుల రక్షణ కోసం ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ ఆవిర్భవించిందని, గీత ముఖర్జీ మహిళల పక్షాన అనేక పోరాటలు చేశారని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వాలు మహిళలకు సరైన గుర్తింపు ఇవ్వడం లేదన్నారు. హక్కులు, చట్టాలపై మహిళలను చైతన్యవంతులను చేస్తూ పోరాటలకు సిద్ధం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అమీనా బేగం, కృష్ణవేణి, షాబాన బేగం, అరుణ, రాణి, పుష్ప పాల్గొన్నారు.

సిట్టింగ్ స్థానం బీజేపీదే..!

- రెండోసారి విజయం దక్కించుకున్న కమలం పార్టీ
- గట్టి పోటీ ఇచ్చిన కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ
- డిపాజిట్ కోల్పోయిన బీఆర్ఎస్
- ప్రభావం చూపించని వివిధ పార్టీలు..స్వతంత్రులు
- వీరి కంటే నోటాకే అధిక ఓట్లు

ఆదిలాబాద్ లోక్‌సభ స్థానాన్ని భారతీయ జనతా పార్టీ(బీజేపీ) కైవసం చేసుకుంది. వరుసగా రెండోసారి విజయం దక్కించుకుంది. ఓట్ల సమరంలో కాంగ్రెస్ పార్టీ గట్టి పోటీ ఇచ్చినా చివరకు పరాజయం పాలైంది. ఇక అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే లోక్‌సభ ఎన్నికల్లోనూ భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) ఎలాంటి ప్రభావం చూపించలేకపోయింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఓట్ల వేటలో చతికిలపడి డిపాజిట్ కోల్పోయింది. ఇక వివిధ పార్టీల నుంచి బరిలో దిగిన అభ్యర్థులతో పాటు పలువురు స్వతంత్రులు ఎలాంటి ప్రభావాన్ని చూపించలేకపోయారు. కనీసం 10వేల ఓట్ల మార్కు దాటలేకపోయారు. ఇక వీరి కంటే నోటాకు అధికంగా ఓట్లు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. మంగళవారం ఉదయం 8గంటలకు ప్రారంభమైన ఈ లెక్కింపులో సాయంత్రం ఫలితం వెల్లడయ్యే వరకు బీజేపీ అభ్యర్థి ఆధిక్యం కనబర్చారు. మధ్యలో కొన్ని రౌండ్లలో కాంగ్రెస్ అభ్యర్థి సైతం సరిసమాన ఓట్లు సాధించినప్పటికీ బీజేపీ అభ్యర్థి మెజార్టీని దాటలేకపోయారు. చివరకు కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణపై బీజేపీ అభ్యర్థి గోడం నగేష్ 90,932ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. ఈయనకు రిటర్నింగ్ అధికారి రాజర్షి షా ధ్రువీకరణపత్రాన్ని అందించారు.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్‌టౌన్

లోక్‌సభ ఎన్నికల సమరం ముగిసింది. ఓట్ల వేటలో బీజేపీదే పైచేయిగా నిలిచింది. మంగళవారం వెల్లడైన ఫలితాల్లో కమలం పార్టీకి విజయం వరించింది. ఇది వరకు సిట్టింగ్ స్థానమైన ఆదిలాబాద్ లోక్‌సభలో మరోసారి అదే పార్టీకి కైవసం చేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇక రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఈ స్థానంలో విజయం సాధిస్తుందని ఆ పార్టీ శ్రేణులు భావించినా చివరకు నిరాశే మిగిలింది. అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు ఓ వెలుగు వెలిగిన గులాబీ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో చతికిలపడటంతో పాటు లోక్‌సభ ఎన్నికల్లోనూ ఘోర పరాజయాన్ని చవిచూసింది. కనీసం డిపాజిట్ సైతం సాధించలేకపోయింది. స్వతంత్రులు, వివిధ పార్టీల నుంచి బరిలో నిలిచిన వారు ప్రభావం అంతంత మాత్రంగానే కనిపించింది. ఆదిలాబాద్ లోక్‌సభ స్థానంలో 16,50,175 ఓట్లు ఉండగా 12 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. ఎన్నికల్లో 12,21,563 ఓట్లు పోలయ్యాయి. వీటికి లెక్కింపు చేపట్టగా.. బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు 1,36,380 ఓట్లు సాధించగా.. కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ 4,71,220 ఓట్లు, బీజేపీ అభ్యర్థి గోడం నగేష్ 5,58,103ఓట్లు సాధించారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లలోనూ బీజేపీ అధిక్యం సాధించింది. బీజేపీకి 9232 ఓట్లు రాగా కాంగ్రెస్‌కు 5183, బీఆర్ఎస్‌కు 837మంది ఉద్యోగులు ఓట్లు వేశారు. పోస్టల్ బ్యాలెట్లను సైతం పరిగణనలోకి తీసుకుంటే కాంగ్రెస్ అభ్యర్థిపై బీజేపీ అభ్యర్థి నగేష్ 90,932 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. నోటాకు 11,743ఓట్లు రాగా..పోస్టల్ బ్యాలెట్లలో 841 ఓట్లు తిరస్కరణకు గురయ్యాయి.

సిట్టింగ్ స్థానం నిలబెట్టుకున్న బీజేపీ

ఆదిలాబాద్ లోక్‌సభ స్థానం వరుసగా రెండోసారి కమలం ఖాతాలోకి చేరింది. 2019లోనూ బీజేపీ నుంచి సోయం బాపురావు ఎంపీగా విజయం సాధించగా..తాజాగా 2024లో ఆ పార్టీ నుంచి బరిలో దిగిన గోడం నగేష్ గెలుపొందారు. సిట్టింగ్ స్థానం కావడంతో బీజేపీ తొలి నుంచి ఈ స్థానంపై ప్రత్యేక దృష్టిపెట్టింది. ఇది వరకు ఎంపీగా పనిచేసిన సోయం బాపురావును కాదని.. గోడం నగేష్‌కు టికెట్ కేటాయించింది. మరోవైపు మోడీ ఛరిష్మా, హిందుత్వవాదంతో పాటు ఈ లోక్‌సభ పరిధిలో నలుగురు ఎమ్మెల్యేలు బీజేపీకి చెందిన వారే ఉండటం ఆ పార్టీకి కలిసివచ్చింది. మరోపక్క రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఈ సారి ఆదిలాబాద్ సభ స్థానాన్ని దక్కించుకోవాలని భావించింది. ఇందుకు ఆదివాసీ ఉద్యమకారిణి ఆత్రం సుగుణకు టికెట్ కేటాయించింది.తొలిసారి మహిళకు టికెట్ కేటాయించింది. ఈ లోక్‌సభ పరిధిలో ఆ పార్టీకి ఒకే ఎమ్మెల్యే ఉన్నప్పటికీ.. మిగితా వాటిలో పలువురు బీఆర్ఎస్ కీలక నేతలు హస్తం పార్టీలో చేరడంతో పాటు మంత్రి సీతక్క



కొన్ని రోజుల పాటు ఇక్కడే మకాం వేసి ప్రచారం చేశారు. ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి సైతం పలుమార్లు పర్యటించి ప్రచారం నిర్వహించారు. కానీ ఓట్ల వేటలో మాత్రం వెనుకబడి పరాజయం పొంది రెండో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఇక అసెంబ్లీ ఎన్నికల నాటి వరకు ఓ వెలుగు వెలిగిన బీఆర్ఎస్ లోక్‌సభ ఎన్నికలు వచ్చేసరికి ఎలాంటి ప్రభావం చూపించలేకపోయింది. ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు గులాబీ పార్టీ నుంచి బరిలో దిగారు. గతంలో చేపట్టిన అభివృద్ధి పనులతో పాటు పార్టీ క్యాడర్ పటిష్టంగా ఉండటం..ఈ లోక్‌సభ పరిధిలో ఇద్దరు ఎమ్మెల్యేలు ఆ పార్టీకి చెందిన వారే ఉండటంతో విజయంపై నమ్మకం పెట్టుకున్నారు. కానీ ఓట్లను సాధించడంతో మాత్రం విఫలమయ్యారు. గతంలో ఎన్నడూలేని విధంగా డిపాజిట్ కోల్పోవడం పార్టీ శ్రేణులను మరింత నిరాశకు గురిచేసింది. ఇక బీఎస్పీ, డీఎస్పీ వంటి పార్టీలతో పాటు పలువురు స్వతంత్ర అభ్యర్థులు సైతం ఎలాంటి ప్రభావం చూపించలేకపోయారు. వీరి కంటే నోటాకు అధికంగా ఓట్లు రావడం గమనార్హం.

లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన పార్టీలకు వచ్చిన ఓట్ల వివరాలు

నియోజకవర్గం	బీఆర్ఎస్	కాంగ్రెస్	బీజేపీ
సిర్పూర్(టి)	19840	62956	71325
ఆసిఫాబాద్	38597	73996	47056
ఖానాపూర్	18520	61587	75106
ఆదిలాబాద్	16265	77056	82394
బోథ్	22472	65204	70118
నిర్మల్	8181	62920	106770
ముధోల్	12505	67501	105334
మొత్తం	1,36,380	4,76,403	5,67,335

లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ, అభ్యర్థుల వారీగా పోలైన ఓట్ల వివరాలు

పార్టీ	అభ్యర్థి	వచ్చిన ఓట్లు
బీఆర్ఎస్	ఆత్రం సక్కు	1,37,217
కాంగ్రెస్	ఆత్రం సుగుణ	4,76, 403
బీజేపీ	గోడం నగేష్	567335
బీఎస్పీ	మేస్రం జంగుబాపు	6735
గోండ్వాన దండకారణ్యపార్టీ	వామన్‌రావు	1684
డీఎస్పీ	మేస్రం గంగాదేవి	3465
ఇండియా ప్రజాబంధు పార్టీ	గేడం సాగర్	1545
వైఎస్ఆర్ పార్టీ	చవాన్ సుదర్శన్	4636
విద్యార్థుల రాజకీయ పార్టీ	ఎన్.తిరుపతి	2287
ఆధార్ పార్టీ	మాలోత్ శ్యాంలాల్ నాయక్	7496
స్వతంత్ర	భుక్యా జైవంత్‌రావు	6439
స్వతంత్ర	రాథోడ్ సుభాష్	6521



గెలుపు ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న బీజేపీ అభ్యర్థి గోడం నగేష్



తండ్రీకొడుకులు వివేక్, వంశీ గెలుపు సంతోష ఆలింగనం



కౌంటింగ్‌లో ఉద్యోగులు



కౌంటింగ్ కేంద్రంలోకి వస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ

కౌంటింగ్‌లో కవల ఎస్సైలు


- గుర్తించడంలో అధికారుల ఆపసోపాలు



నవతెలంగాణ-హాజీపూర్

పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల లెక్కింపు కేంద్రం మండలంలోని ముల్కల్లలో ఏర్పాటు చేశారు. దీనికి పోలీస్ బందోబస్తులో భాగంగా హాజీపూర్ ఎస్సై గోపతి సురేష్, బెల్లంపల్లి తాళ్ళగురిజాల ఎస్సై గోపతి నరేష్‌లకు అక్కడే డ్యూటీ పడింది. ఇదంతా విధుల్లో భాగమే అయినా 2020 బ్యాచ్‌కు చెందిన ఈ ఇద్దరు ఎస్సైలు కవల సోదరులు. ఒకే పోలికలతో ఉండడంతో కౌంటింగ్ కేంద్రం వద్ద వీరిద్దరిని గుర్తించడంలో అధికారులు, సిబ్బంది నానా తంటాలు పడ్డారు. ఒకే పోలికలతో ఉండడంతో వీరికి పరిచయ ఉన్న వారు సార్ నమస్తే అంటూ పలకరించే ప్రయత్నం చేయగా వీరు గుర్తు పట్టకపోవడంతో అవాక్కయ్యారు. నరేష్ ఆనుకొని సురేష్‌ను, సురేష్ ఆనుకొని నరేష్‌ను పలకరించారు. కాగా వీరు ఎస్సైలు కాక ముందు ఇద్దరు ఒకేసారి 13వ బెటాలియన్‌లో కానిస్టేబుల్ ఉద్యోగం చేశారు. ఒకేసారి ఎస్సైలు అయ్యారు.

జనసేన గెలుపు పట్ల సంబరాలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆంధ్రప్రదేశ్ ఎన్నికల జనసేన పార్టీ విజయం సాధించడంతో పార్టీకి చెందిన నాయకులు జిల్లా కేంద్రంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. పార్టీ అభ్యర్థులను ఆశీర్వాదించిన ప్రజలకు ధన్యవాదలు తెలిపారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ నియోజకవర్గం ఇన్‌ఛార్జీ మరియాల వినీత్, నాయకులు సాయితేజ, వైరాగరే రమేష్, వైరాగడే రవి, అఖిల్, రాజు, కోవ రాహుల్, శ్యామ్, లక్కీ, సాయి కృష్ణ, శశి, వినోద్, కవాల్కర్ శ్రీకాంత్, తిరుపతి, శ్రవణ్, ప్రణీత్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్, బీఎస్పీల ఓట్లేవీ..?

- ఈ ఓటర్లంతా కాంగ్రెస్‌కే మొగ్గు చూపారా..?
- లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై జోరుగా చర్చలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై ప్రస్తుతం సిర్పూరు నియోజవర్గంలో జోరుగా చర్చలు సాగుతున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో నాలుగు పార్టీల మధ్య ఉన్న పోరు కాస్తా ఈ లోక్‌సభ ఎన్నికలకు వచ్చేసరికి రెండు పార్టీల మధ్య పోరుగా మారింది. మరి గత అసెంబ్లీ ఎన్నికలలో మిగిలిన రెండు పార్టీలకు ఓటు వేసిన ఓటర్లు ఇపుడు ఏ పార్టీకి మద్దతు తెలిపారనే విషయంలో చర్చ సాగుతోంది.

ఆరు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో సిర్పూరు నియోజకవర్గంలో ప్రధానంగా నాలుగు పార్టీల మధ్య పోరు రసవత్తరంగా సాగింది. ఎన్నికల సమయంలో బీఆర్ఎస్, బీఎస్పీ, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు హోరాహోరీ ప్రచారం చేశారు. కాని ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యేసరికి ఈ చతుర్ముఖ పోరు కాస్తా త్రిముఖ పోరుగా మారినట్లు ఫలితాలను బట్టి చూస్తే వెల్లడైంది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ నుండి పోటీ చేసిన కోనేరు కోనప్పకు 60,614 ఓట్లు, బీజేపీ నుండి పోటీ చేసిన డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబుకు 63,702 ఓట్లు, బీఎస్పీ నుండి పోటీ చేసిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు 44,646 ఓట్లు రాగా, కాంగ్రెస్ నుండి పోటీ చేసిన రావి శ్రీనివాస్‌కు 8,427 ఓట్లు వచ్చాయి. ఆ ఎన్నికలలో బీజేపీ నుండి పోటీ చేసిన హరీష్‌బాబు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అనంతరం జరిగిన పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్ నుండి పోటీ చేసిన కోనేరు కోనప్ప కాంగ్రెస్‌లో చేరారు. బీఎస్పీ నుండి పోటీ చేసిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బీఆర్ఎస్‌లో చేరారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలకు వచ్చే సరికి నియోజకవర్గంలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు జోరుగా ప్రచారం సాగించినా, బీజేపీ, కాంగ్రెస్‌లో మధ్యే ప్రధాన పోరు సాగిందని చెప్పవచ్చు. అసెంబ్లీ ఎన్నికలలో 60 వేలపై చిలుకు సాధించిన బీఆర్ఎస్‌కు లోక్‌సభ ఎన్నికలకు వచ్చేసరికి 19,840 ఓట్లకు పడిపోయింది. ఇందులో సుమారు 40 వేలపైచిలుకు ఓటర్లు ఈ ఎన్నికలలో ఇతర పార్టీలకు ఓట్లేశారు. అసెంబ్లీ ఎన్నికలలో 44,646 ఓట్లు సాధించిన బీఎస్పీ ఈ ఎన్నికలలో పోటీ చేయలేదు. మరి ఈ ఓటర్లు కూడా కాంగ్రెస్, బీజేపీల వైపే మొగ్గు చూపారా..? అనేది సందిగ్దంగా ఉంది. అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీకి 63 వేల పైచిలుకు ఓట్లు రాగా ఇపుడు అది ఇంకాస్తా పెరిగి 71 వేల చిలుకుకు చేరుకుంది. అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్‌కు కేవలం 8,427 ఓట్లు రాగా, ఇపుడు అది సుమారు 63 వేలకు చేరుకుంది. దీనికి కారణాలు లేకపోలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండడం, వ్యక్తిగత ఓటు బ్యాంక్ ఉన్న కోనేరు కోనప్ప కాంగ్రెస్‌లో చేరడం, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి రావి శ్రీనివాస్‌తో కలిసి కోనప్ప పని చేయడం, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క ప్రత్యేకంగా ఈ నియోజకవర్గం మీద దృష్టి సారించి ప్రచారం కొనసాగించడం తదితర కారణాల వల్ల ఓటు బ్యాంక్ పెరిగిందని చెప్పుకోవచ్చు. కాని ఇదే సమయంలో బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కుకు ఈ నియోజకవర్గంలో సుమారు 20 వేల ఓట్లు రావడం కూడా చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నీ తానై ఈ నియోజకవర్గంలో పర్యటించారు. ఒకవైపు అధికార కాంగ్రెస్, మరోవైపు స్థానిక ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీలు నువ్వా నేనా అనే రీతిలో ముమ్మర ప్రచారం చేపట్టినా సుమారు 20 వేల మంది ఓటర్లు బీఆర్ఎస్‌కు ఓట్లు వేశారు.

నీట్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-కాగజ్‌నగర్





నీట్ ఫలితాల్లో కాగజ్‌నగర్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. పట్టణానికి చెందిన దాసరి సిరి సహస్ర 720 మార్కులకు గానూ 560 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ర్యాంకు సాధించింది. దాసరి లక్ష్మణ్ కూతురు సిరిసహస్ర 10వ తరగతి వరకు పట్టణంలోని ఫాథిమా కాన్వెంట్ హైస్కూల్‌లో చదివింది. ఇంటర్మీడియట్ హైదరాబాద్ శ్రీ చైతన్య, మియాపూర్, బ్రాంచ్‌లో చదివింది.

నవోదయలో ఆరుగురికి ర్యాంకు

పట్టణంలోని నవోదయ విద్యాలయంలో ఆరుగురు విద్యార్థులు నీట్ పరీక్ష రాయగా ఆరుగురు సైతం నీట్‌కు అర్హత సాధించారు. కుమరం పవన్ జ్యోత్ 720 మార్కులకు గానూ 511, జాదవ్ సంజీవ్ 453, చవాన్ 432, తిలక్ 377, సోయం 358, గెడం శ్రీనిత్య 328 మార్కులు సాధించి మెడిసిన్‌కు క్వాలిఫై అయ్యారు. కుమరం పవన్ జ్యోత్ రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించాడు. పవన్ జ్యోత్ తండ్రి సీతారం కాగజ్‌నగర్ డీఎంహెచ్‌ఓగా విధులు నిర్వహిస్తుండగా, తల్లి ప్రమీల ప్రభుత్వ ఉన్నత పాఠశాల గర్ల్స్‌లో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్నారు.

ప్రశాంతంగా ముగిసిన కౌంటింగ్

నవతెలంగాణ-హాజీపూర్

పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఈ పార్లమెంటు పరిధిలో మంచిర్యాల జిల్లాలోని చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు మండలంలోని ముల్కల్ల ఐజా కాలేజీలో ఏర్పాటు చేశారు. గత నెల 13న జరిగిన పార్లమెంటు ఎన్నికల ఈవీఎంలను ఇక్కడ గట్టి భద్రత నడుమ భద్ర పరిచారు. 23 రోజులుగా నిత్యం జిల్లా కలెక్టర్, పోలీస్ అధికారుల నేతృత్వంలో పర్యవేక్షించారు. జిల్లా ఎన్నికల ప్రత్యేక అధికారులుగా విజయ, ఈ.రవికుమార్ పర్యవేక్షణలో కలెక్టర్ బదావత్ సంతోష్, రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు ఆద్యంతం లెక్కింపు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టారు. మంచిర్యాల ఎన్నికల అధికారిగా ఆర్డీవో రాములు, చెన్నూర్ ఎన్నికల అధికారి చంద్రకళ, బెల్లంపల్లి నియోజకవర్గ ఎన్నికల అధికారిగా స్థానిక సంస్థల కలెక్టర్ రాహుల్ వ్యవహరించారు. వీరితో పాటు 350 మంది ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు. పోస్టల్ బ్యాలెట్‌ల లెక్కింపు ఇక్కడ లేకపోవడంతో ఉదయం 8గంటల నుండే ఈవీఎంల లెక్కింపు ప్రారంభించారు. 9గంటల వరకు మూడు నియోజకవర్గాల మొదటి రౌండ్ ఫలితాలు ప్రకటించారు. చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల లెక్కింపు 17రౌండ్లలోనే పూర్తయింది. మంచిర్యాల నియోజకవర్గం 21 రౌండ్ల లెక్కింపు మధ్యాహ్నం 3 గంటలకు పూర్తయింది.

గట్టి పోలీసుబందోబస్తు

ముల్కల ఐజా కాలేజీలో ఎన్నికల కౌంటింగ్ కోసం రామగుండం సీపీ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. మూడంచెల భద్రత వలయం ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడ చెకింగ్ కౌంటర్లు ఏర్పాటు చేసి, సెల్‌ఫోన్‌లను కౌంటింగ్ హాల్‌లోకి అనుమతించలేదు. సోమవారం సాయంత్రం నుండే



భద్రత బలగాలు కౌంటింగ్ కేంద్రం వద్ద భద్రత చర్యలు చేపట్టారు. మంచిర్యాల డీసీపీ అశోక్ కుమార్‌తో పాటు 7గురు ఏసీపీలు, 15 మంది సీఐలు, 54 మంది ఎస్సైలు, 600 పోలీస్ సిబ్బందితో గట్టి భద్రతా చర్యలు చేపట్టారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా కౌంటింగ్ ప్రక్రియ పూర్తికావడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

గాలిదుమారంతో ఆగమాగం..

- విరిగిన చెట్లు.. నేలకొరిగిన స్తంభాలు..
- వర్షంతో చల్లబడిన వాతావరణం



నవతెలంగాణ-హాజీపూర్

వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో మండలంలో గాలిదుమారంతో భారీ వర్షం పడింది. మధ్యాహ్నం ఈదురు గాలులతో మండలంలోని గ్రామాలన్నీ ఆగమాగమయ్యాయి. గాలులతో చెట్లు నేలకొరగగా విద్యుత్ స్తంభాలు కూలి పడ్డాయి. దీంతో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గ్రామాల్లో గాలులతో రేకుల షెడ్లు కూలిపోగా, ఇళ్లపై కప్పులన్నీ ఎగిరిపోయాయి. విద్యుత్ అధికారులు సకాలంలో స్పందించిన సాయంకాలం వరకు విద్యుత్ సరఫరా పునరుద్దరించలేకపోయారు.

పిడుగు పాటుతో వరిగడ్డి దగ్ధం

నవతెలంగాణ-సారంగాపూర్



మండలంలోని యాకర్‌పల్లె గ్రామంలో నిర్మల్ పట్టణానికి చెందిన పారిశ్రామిక వేత్త పడిగెల సత్యనారాయణ, కేదార్‌నాథ్‌ల వ్యవసాయం యాకర్‌పల్లెలో ఉంది. 200 వందల పశువులు ఉన్నాయి. వాటికి మేత కోసం సేకరించిన పెట్టిన వరిగడ్డి కట్టలకు సాయంత్రం పిడుగు పడి నిప్పంటుకొని దగ్ధమైంది. గ్రామస్తులు అప్రమత్తమై ప్రక్కనే ఉన్న బోరు బావి నుంచి పైపులతో నీళ్ల పట్టి మంటలను ఆర్పివేశారు. అయిన ఫలితం లేకుండా పోయిందని స్థానికులు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-కడెం



మండలంలోని అంబారిపేట్ గ్రామంలో ఎల్పుగొండ మల్లేష్ అనే వ్యక్తి మూడు రోజుల కింద అనారోగ్యంతో మరణించగా మంగళవారం విషయం తెలుసుకున్న అంబారిపేట్ మాజీ సర్పంచ్ మెరుగు ఇంద్రసేనారెడ్డి రూ.10వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. అలాగే మానవసేవే మాధవసేవ గ్రూప్ ఫౌండర్ శేట్‌పెల్లి మహేందర్ రూ.5వేలు అదేవిధంగా రేంకల వెంకటేష్ తనవంతుగా ఒక రైస్ బ్యాగ్, గ్రూప్‌లోని సభ్యులు తమ వంతు సహకారంగా రూ.3,4వందలు కలిపి మొత్తం రూ.18,400లను బాధిత కుటుంబానికి మానవసేవే మాధవసేవ గ్రూప్ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మెరుగు రవీందర్‌రెడ్డి, రేంకల రాజన్న, నాయకులు తాళ్లపెల్లి రమేష్, మల్యాల స్వామి, కొప్పుల నారాయణ, రేంకల శీను, కొప్పుల రమేష్, సతీష్, స్వామి, శంకర్ పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత



నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలోని మంగళవారం వేకువజామున మూడు గంటల నుంచి నాలుగు గంటల సమయంలో అక్రమంగా కలప తరలిస్తున్నారన్న ముందస్తు సమాచారం మేరకు తర్నం గ్రామం నుంచి కుమారి గ్రామానికి అక్రమంగా టేకు కలప తరలిస్తున్నరని, కుప్టి గ్రామం వద్ద అటవీశాఖ అధికారులు గస్తీ నిర్వహించి, 13 టేకు దుంగలు తీసుకొని వస్తున్న ఆటోను పట్టుకున్నారు. వాటి విలువ సుమారు రూ.60వేలు ఉంటుందని ఎఫ్ఆర్ఓ గణేష్ తెలిపారు. ఎపీ01ఎక్స్ 1902 గల ఆటోను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్టు ఎఫ్ఆర్ఓ తెలిపారు, అక్రమంగా తరలిస్తున్న కలప పురుషోత్తం అను వడ్రంగి గ్రామం కుమారికి తరలిస్తున్నారని, ముల్తానీలు తర్నం గ్రామానికి చెందిన జి.ఫణిందర్ అనే వ్యక్తి ఆటోలో తరలిస్తుండగా పట్టుకున్నట్టు తెలిపారు.

పిచ్చి కుక్క స్వైర విహారం... 8 మందికి గాయాలు..

నవతెలంగాణ-లోకేశ్వరం



మండలంలోని ఆర్లి, గోడిసెర గ్రామంలో మంగళవారం ఉదయం పిచ్చి కుక్క స్వైర విహారం చేసి 8 మందిని గాయాల పాలు చేసింది. ఇందులో 6 గురు మహిళలు, ఒక వృద్ధుడు, ఒక బాలుడు ఉన్నారు. ఈ ఘటనలో రాతటి భారత(51), హద్గాం భోజన్న(70), రామపురం శివక్క(62)కు తీవ్ర గాయాలు కాగా, మిగిలినవారికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎంపీటీసీ దత్తు బాధితులను ప్రయివేట్ వాహనంలో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో ప్రాథమిక ఆరోగ్య వైద్యురాలు తేజస్విని, సిబ్బంది బాధితులకు వైద్యం అందించి, యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేశారు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి గంగాధర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి బాధితులను పరామర్శించారు. కరిచింది పిచ్చి కుక్క కావడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేయగా, మెరుగైన వైద్యం కోసం డా.తేజస్విని బాధితులను నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా బాదితులు మాట్లాడుతూ అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి తమను కాపాడాలని కోరారు.





మెరుగైన వైద్యం కోసం నిర్మల్ ఏరియా ఆస్పత్రికి రెఫర్ చేశాం



డా. తేజస్విని

పిచ్చికుక్క కాటుకు గురైనవారికి యాంటి రేబిస్ టికాలు వేశాము. మెరుగైన చికిత్స కోసం నిర్మల్ ఏరియా ఆస్పత్రికి రెఫర్ చేశాం. ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

అల్లనేరేడు పండ్లకు భలే గిరాకీ



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ప్రకృతి సిద్ధంగా లభించే అల్లనేరేడు పండ్లకు భలే గిరాకీ ఉంది. ప్రతి యేట మే, జూన్ మాసంలో దొరికే ఈ పండ్లు మార్కెట్‌లోకి రావడంతో కొనుగోలు దారులతో కిటకిట లాడుతోంది. ప్రస్తుతం దీని ధర మార్కెట్‌లో కిలో రూ.200 పలుకుతోంది. ధర కాస్త ఎక్కువ ఉన్న ఓ పావు కిలో అయిన కొని తమ కుటుంబ సభ్యులకు దీని తీపి రుచిని చూస్తున్నారు. ఏడాదికి ఒకసారి దొరికే ఈ పండ్లలో అనేక పోషక విలువలు ఉంటాయని వైద్యులు చెపుతున్నారు. దీనిలో లభించే యాంటి ఆక్సిడెంట్లు రక్తాన్ని శుభ్రపరుస్తుంది. షుగర్ వ్యాధి ఉన్న వారు ఈ పండ్లు తినడం వల్ల ఆ వ్యాధి అదుపులో ఉంటోంది. పండ్లు తిన్న తరువాత వీటి గింజలను ఆరబెట్టిన తరువాత చూర్ణం (పొడి) చేసి రోజుకు ఒక చెంచా తినడం వల్ల కిడ్నీలో ఉన్న రాళ్లను తొలగిస్తుంది. దీనితో పాటు అనేక రకాల విటమిన్లు, పోషక విలువలు ఈ పండ్లలో లభిస్తాయి. అల్ల నేరేడు చెట్టుపై బెరడును అనేక రకాల క్యాన్సర్ వ్యాధులను నయం చేస్తోందని ఆయుర్వేద వైద్యులు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా సీజనల్‌గా దొరికే ఈ పండ్లను వినియోగదారుల కొనుగోలుతో కిటకిట లాడుతున్నాయి.

గడువులోగా పనులు పూర్తి చేయాలి

- పలు గ్రామాల్లో పర్యటించిన జిల్లా ప్రత్యేకాధికారి నాగమణి



నవతెలంగాణ-లోకేశ్వరం

అమ్మఆదర్శ పాఠశాల పనులు పాఠశాలల పున:ప్రారంబానికి ముందు గడువులోగా పూర్తి చేయాలని జిల్లా ప్రత్యేకాధికారి నాగమణి అన్నారు. మంగళవారం మండలంలోని పుస్పూర్, సేవాలాల్ తండా, పిప్రి గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో చేపడుతున్న పల్లెప్రగతి పనులను, ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న అమ్మఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని నిర్వాహకులకు సూచించారు. నర్సరీల్లో మొక్కలు ఎండకుండా నిత్యం నీరు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సోలమాన్ రాజ్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

మండలాభివృద్ధికి కృషి చేయాలి



నవతెలంగాణ-నార్నూర్

పార్లమెంటు ఎన్నికల్లో విజయం సాధించిన ఎంపీ గోడం నగేష్‌కు మండల బీజేపీ నాయకులు సంజీవ్ నాయక్, విద్యారాణి పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలాభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

గతం కంటే కాంగ్రెస్ ఓటింగ్‌శాతం పెరగడం హర్షణీయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ కనీవిని ఎరుగనిరీతిలో ఓటింగ్ శాతం పెరగడం హర్షణీయమని కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రజాసేవా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రెండు లక్షల 50 వేలు మైనస్‌గా ఉన్న ఓట్లను 78 వేలకుపైగా సాధించేందుకు శ్రమించిన నాయకులు, కార్యకర్తల కృషిని ఆయన కొనియాడారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, పెరిగిన ఓటింగ్ శాతం రానున్న ఎన్నికలకు దోహద పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం శక్తి వంచన లేకుండా కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తమ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణకు ఓటు వేసిన ప్రతిఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. నాయకులు, కార్యకర్తలకు అన్నివేళలా తాను అండగా ఉంటానని అన్నారు. కార్యక్రమంలో డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, కౌన్సిలర్ కలాల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు గిమ్మ సంతోష్‌రావు, లోక ప్రవీణ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మండలంలో పలుచోట్ల వర్షం

నవతెలంగాణ-నార్నూర్

మండలంలో మంగళవారం పుసిగూడ, జామడ, బలాన్‌పూర్, నాగల్‌కొండ, గుంజాల, గంగాపూర్, తాడిహత్నూర్ తదితర గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కూరిసింది. కురిసిన వర్షంతో వాతావరణం చల్ల పడింది. ఎండ వేడిమితో అల్లాడుతున్న ప్రజలు చల్లటి వాతావరణంతో కాస్త ఉపశమనం లభించింది. రైతులు వ్యవసాయ క్షేత్రాలను చదును చేసి, విత్తనాలు నాటేందుకు సిద్ధమవుతున్నారు.

ప్రజా పాదయాత్ర ఫలితమే అధిక మెజారిటీ

నవతెలంగాణ-నేరడిగొండ

ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ గెలుపు ధ్యేయంగా బోథ్ నియోజకవర్గంలో పని చేశామని కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఏలేటి అశ్విన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతీ కార్యకర్తను నాయకులను కలుపుకొని ఎండలను సైతం లెక్కచేయకుండా నియోజకవర్గం మొత్తం ప్రజా పాదయాత్ర చేపట్టామని తెలిపారు. ప్రతీ తండాకు, గూడెలకు, కాంగ్రెస్ పార్టీని చేతి గుర్తును ప్రజల మదిలో ఉండటంతోనే బోథ్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కి 70వేల ఓట్లే నిదర్శనమని తెలిపారు. ఇది కాంగ్రెస్ పార్టీకి పెరుగుతున్న ఆదరణ అని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కి 32 వేలు ఓట్లు రాగా ఇప్పుడు 38 వేల ఓట్లు అధికంగా రావడం ప్రజలలో కాంగ్రెస్ పార్టీకి పెరుగుతున్న ఆదరణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధైర్య పడకుండా రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

పురుగులమందు తాగి యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-బోథ్

పురుగులమందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కోట(కె) గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కోట(కె) గ్రామానికి చెందిన జల్కే ఆకాష్(20) పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గత కొన్ని రోజులుగా మద్యానికి బానిసై మంగళవారం తన ఇంట్లోనే మద్యం మత్తులో పురుగులమందు తాగి ఆత్మహత్య పాల్పడ్డాడు. భార్య అనసూయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రాము తెలిపారు.



బాసర నిత్యాన్నదాన సత్రానికి విరాళం అందజేత

నవతెలంగాణ-కుభీర్

ప్రసిద్ధి పుణ్య క్షేత్రమైన బాసర సరస్వతి ఆలయానికి సమీపంలో మున్నూరు కాపు సంఘం స్థలం కొనుగోళ్ల చేపట్టడంతో ముధోల్ నియోజక వర్గంలో ఉన్న మున్నూరు కాపు సంఘాల ఆధ్వర్యంలో విరాళాలు అందించడం జరుగుతుంది. దీంతో మంగళవారం కుభీర్ మండలంలోని జంగావ్ గ్రామానికి చెందిన మున్నూరు కాపు సభ్యులు ముధోల్ తాలూకా అధ్యక్షుడు రాళ్ల రమేష్ సమక్షంలో గ్రామస్తులు రూ.51వేలు అందజేశారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు తాలూకా సంఘం అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ ప్రసిద్ధి గాంచిన బాసర సరస్వతి మందిరం దగ్గర మున్నూరు కాపు సంఘం నిత్యాన్నదాన సత్రం స్థలం కొనుగోలు చేపట్టడంతో వాటికి నిర్మల్ జిల్లాతో పాటు నిజామాబాద్, ఆదిలాబాద్, నాందేడ్ నుంచి మున్నూరు కాపు సభ్యులు విరాళాలు అందించారు. అదే విధంగా మిగితా వారు కూడా త్వరలోనే అందించేలా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సిద్ధం వివేకానంద, తాలూకా కార్యవర్గ సభ్యులు చిమ్మన్ పోశెట్టి, పుప్పల పీరాజీ, ఈర్ల హనుమల్లు, దశరథ్, మెంచు రాములు, దత్త్రాత్రి, మండల మున్నూరు కాపు సంఘ సభ్యులు ఉన్నారు.

బీజేపీ కార్యకర్తల సంబరాలు

నవతెలంగాణ-నేరడిగొండ

ఆదిలాబాద్ ఎంపీగా బీజేపీ అభ్యర్థిగా గోడం నగేష్ గెలుపొందడంతో మండల కేంద్రంలో బీజేపీ కార్యకర్తల సంబరాలు అంబరాన్నంటాయి. మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు సాబ్లే సంతోష్ సింగ్ ఆధ్వర్యంలో టపాసులు కాలుస్తూ, మిఠాయిలు పంచి విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి : పార్లమెంటు ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడ్డాయి. ఈ ఫలితాల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ అత్యధిక మెజారిటీతో గెలుపొందారు. దీంతో పార్టీ మండల నాయకులు అరెల్లి రాజలింగం, జెడ్పీటీసీ అర్క పుష్పలత, నాగోబా ఆలయ కమిటీ చైర్మెన్ మెస్రం తుకారాం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో టపాసులు కాల్చి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోడీ దేశ ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. మరో సారి మోడీని ప్రధాన మంత్రిని చేయడం సంతోష దాయకమన్నారు. మన ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ గతంలో ఉమ్మడి రాష్ట్రంలో గిరిజన శాఖ మంత్రిగా, ఎంపీ, ఎమ్మెల్యేగా పనిచేశారని అన్నారు.

బోథ్ : ఆదిలాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి గొడం నగేష్ భారీ మెజారిటీతో గెలుపొందారు. మంగళవారం బోథ్ మండల కేంద్రం తో పాటు సొనాలలోని సంబరాలు జరుపుకున్నారు. అలాగే బీజేపీ నుంచి గెలుపొందిన అభ్యర్థిని అభినందించారు. జిల్లాలో చేసిన అభివృద్ధికి ప్రజలు పట్టం కట్టారని అన్నారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో టపాకాయలు కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ, వీహెచ్ పీ నాయకులు పాల్గొన్నారు.

నిర్మల్ : ఆదిలాబాద్ లోకసభ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ గెలుపొందడంతో జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి నివాసంలో నాయకులు, కార్యకర్తలు మంగళవారం సంబరాలు చేసుకున్నారు. టపాసులు పేల్చి, స్వీట్లు తినిపించుకున్నారు. ఇటు రాష్ట్రంలో అత్యధికంగా సీట్లు రావడం, అటు దేశంలో ఎన్డీఏ ప్రభుత్వం రావడం హర్షణీయమని నాయకులు పేర్కొన్నారు. పదేండ్లలో జరిగిన అభివృద్ధిని కొనసాగిస్తారని తెలిపారు. కార్యక్రమంలో దిలావర్‌పూర్ జెడ్పీటీసీ తక్కల రమణారెడ్డి, చందు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


నేరడిగొండ


ఇంద్రవెల్లి


బోథ్


నిర్మల్

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
బుధవారం | జూన్ 05, 2024 | www.navatelangana.com

సర్క్యులర్ల డిజిటలైజేషన్

నవతెలంగాణ-రెబ్బెన



సింగరేణిలో జారీ చేసే ప్రతి సర్క్యులర్ డిజిటలైజేషన్ కానుందని ఇన్‌చార్జి జీఎం ఎం.నరేందర్ అన్నారు. మంగళవారం జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్లో అన్ని విభాగాల అధిపతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గతంలో జారీచేసిన ప్రతి సర్క్యులర్‌ను డిజిటలైజ్ చేయాలన్నారు. భూ నిర్వాసితులు, అద్దె వాహనాల యజమానుల సంఘం సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో అద్దె వాహనాల విషయంలో గుర్తింపు సంఘం నాయకులతో సంప్రదింపులు జరిపారు. వాహన యజమానుల అసోసియేషన్ సభ్యులను చర్చకు పిలిచారు. సమస్యలపై చ ర్చించి పరిష్కారానికి కృషి చేస్తామని కార్మికులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఏజీఎం తిర్మల రావు, పీఓ సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి తిరుపతి, రెడ్డిమల్ల తిరుపతి పాల్గొన్నారు.

లైంగికదాడి కేసులో పదేండ్ల జైలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అత్యాచార కేసులో నిందితుడికి పదేండ్ల జైలుతో పాటు రూ. 6500 జరిమాన విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా సెషన్ కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేష్ తీర్పు ఇచ్చారు. రెబ్బన సీఐ చిట్టి బాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోపి రోల్లపహాడ్ గ్రామానికి చెందిన రెబ్బన సుధాకర్ తాండూర్ మండలం గోపాల్ నగర్‌కు చెందిన మహిళను పెళ్లి చేసుకుంటానని నమ్మ బలికి శారీరకంగా లొంగదీసుకున్నాడు. ఆ అమ్మాయి కుటుంబ సభ్యులు పెళ్లి చేసుకోవాలని సుధాకర్‌ని అడగగా నిరాకరించాడు. దీంతో సదురు మహిళ రెబ్బెన పోలీస్ స్టేషన్‌లో 5 మార్చి 2020న ఫిర్యాదు చేసింది. అప్పటి ఐఓలు రమేష్, అశోక్, సతీష్ నిందితుడిని అరెస్ట్ చేశారు. మంగళవారం కోర్టులో హాజరచగా పీపీ జగన్మోహన్ రావ్ సాక్షులను విచారించి నేరం రుజువు చేయడంతో నిందితుడు రెబ్బెన సుధాకర్‌కు పదేండ్ల జైలుతో పాటు రూ.6500 జరిమాన విధిస్తు జిల్లా ప్రధాన న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. కేసులో నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య, సీఐ చిట్టిబాబు, ఎస్సై చంద్రశేఖర్, కోర్టు అసిఫాబాద్ డివిజన్ లైజనింగ్ ఆఫీసర్ రామ్ సింగ్, కోర్ట్ సిబ్బందిని ఎస్పీ సురేష్ కుమార్ అభినందించారు.

భూసార పరీక్షల జాడేదీ...?

- జిల్లాలో అటకెక్కిన భూసార పరీక్షలు
- తీవ్రంగా వేధిస్తున్న కిట్ల కొరత
- మట్టి స్వభావంపై అవగాహన కరువు
- నష్టాలపాలవుతున్న రైతులు

నవతెలంగాణ-దహెగాం

రైతులు పంటలు వేసే ముందు భూమి సారం, రకం, ఎంత మోతదులో ఎరువులు వాడాలో భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా తెలస్తుంది. దాని అనుగుణంగానే పంటలు సాగుచేస్తే అధిక దిగుబడులు సాధించి రైతులు లాభం పొందవచ్చు. అయితే జిల్లాలో భూసార పరీక్షలు జరగడంలేదు. దీంతో రైతులు ప్రతిఏటా పంట మార్పిడి లేకుండా ఒక రకమైన పంటలు వేస్తూ అవగాహన లోపంతో తీవ్రంగా నష్టపోతున్నారు. రైతులు భూముల్లో ఏఏ పంటలు సాగుచేయాలి..? ఎరువులను ఎంత మోతాదులో వినియోగించాలనే వివరాలు భూసార పరీక్షల ద్వారా తెలుస్తాయి. అలాంటి పరీక్షలు జిల్లా వ్యాప్తంగా జాడలేకుండా పోయాయి. కొన్ని సంవత్సరాలుగా పరీక్షలు పూర్తిగా నిలిచిపోయాయి. మట్టి స్వభావంపై అవగాహన కల్పించే అధికారులు కూడా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఏ రకమైన భూమిలో ఏ పంట వేయాలో అధికారులు చెప్పకపోవడంతో రైతులు ఇష్టారీతిన పంటల సాగు చేస్తూ లాభాలు రాక తీవ్రంగా నష్టపోతున్నారు.

భూసారం పరీక్షలు చేయాలి

రౌతు విఘ్నేష్, రైతు, జీబ్రా



భూ సార పరీక్షలు లేక పోలంలో ఏ పంటలు సాగు చేయాలో తెలియక ఇష్టరీతిన ఎరువులు వాడుతున్నాం. దీంతో పంటల దిగుబడి రాక నష్టపోతున్నాం. వ్యవసాయ శాఖ అధికారులు కూడా అవగాహన కల్పించడం లేదు. భూ సార పరీక్షలు చేసి భూమిని బట్టి పంటలు వేసుకునేల అవగాహన కల్పించాలి.

జిల్లావ్యాప్తంగా 70 క్లస్టర్లు...

మూసా పద్ధతిలో చేసే సాగుకు స్వస్తి చెప్పి అధునాతన వ్యవసాయం వైపు రైతులను మళ్లించి లాభసాటి వ్యవసాయంగా మార్చేందుకు ప్రభుత్వం ఆలోచిస్తుంది. ఐదు వేల ఎకరాలకు ఒక క్లస్టర్‌గా లెక్కించి జిల్లాలో 70 క్లస్టర్లను ఏర్పాటు చేసింది. 2018లో రైతులకు సేవలందించేందుకు ఒక్కో క్లస్టర్‌కు ఏఈఓను నియమించింది. మొత్తం 70 క్లస్టర్లు ఉండగా దాదాపు అన్నింటిలో మినీ ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. ఒక్కో కిట్టు ధర సుమారు రూ.1.3 లక్షలు వరకు వెచ్చించిన ఫలితం లేకుండా పోతోంది. నేల స్వభావం పరీక్షించేందుకు రసాయనాలు, జల్లెడ, ఇతర పరికరాలను అందజేశారు. ఏఈఓలు ఐదు సంవత్సరాల క్రితం వారివారి పరిధిలో భూసార పరీక్షలు నిర్వహించారు. ఇతర పరికరాలు ఇవ్వకపోవడంతో భూసార పరీక్షల కిట్లు మూలనపడి ఉన్నాయి. రసాయనాల సరఫరా లేక మట్టి నమూనా పరీక్షలు జరగడంలేదని తెలుస్తోంది.

సమీపిస్తున్న ఖరీఫ్...

మట్టి నమూనా పరీక్షల కోసం ఏర్పాటు చేసిన మినీ ల్యాబ్‌లు అలంకారప్రాయంగా మారాయి. వానాకాలం సీజన్ సమీపిస్తున్నప్పటికీ మట్టి నమూనాలు సేకరించే



ప్రక్రియ జిల్లాలో ఇంకా ప్రారంభమే కాలేదు. దీంతో భూసారంపై రైతులకు అవగాహన లేక మోతాదుకు మించి రసాయన ఎరువుల వాడకంతో భూమి విస్తారంగా మారి ఏటా దిగుబడులు తగ్గుతున్నాయి.

పైలెట్ గ్రామాలుగా ఎంపిక....

గతంలో జిల్లా వ్యాప్తంగా మండలాల్లో కొన్ని గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. ఆయా గ్రామాల్లో అధికారులు సేకరించిన మట్టి నమూనాలను ఆదిలాబాద్‌కు పంపించి ఫలితాలను రైతులకు వెల్లడించేవారు. భూమిలో అరగజంలోతులో మట్టి తీసి వ్యవసాయ శాఖ అధికారికి అందజేస్తే దానిని భూసార పరీక్ష కేంద్రానికి పంపించేవారు. భూసార పరీక్షతో భూమిలో 16 రకాల పోషకాలు ఎంత వరకు ఉన్నాయో..? తెలుస్తుంది. కొన్ని రోజులుగా గ్రామాల్లో భూసార పరీక్షలు పూర్తిగా నిలిచిపోయి. రైతులకు భూమి సారంపై అవగాహన లేకుండా పోయింది.

ఒక్కసారి పరీక్ష చేస్తే...

గత ఖరీఫ్‌లో పత్తి, వరి, మొక్కజొన్న, సోయా పంట దిగుబడి తగ్గింది. ఏ పంట వేయాలో, ఎంత మోతాదులో ఎరువు వేయాలో తెలియక జిల్లాలోని రైతులు తికమకపడ్డారు. ప్రభుత్వం స్పందించి ఏటా ఒక్కసారి భూసార పరీక్షలు సక్రమంగా నిర్వహిస్తే రైతులకు అవగాహన ఏర్పడుతుందని, ప్రభుత్వం పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి పరామర్శ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఇటీవల శస్త్ర చేయించుకొని హైదరాబాద్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబును జిల్లా కేవీపీఎస్ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన బాగోగులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకొని తిరిగి ప్రజా ఉద్యమంలోకి రావాలని కోరుకున్నారు. పరామర్శించిన వారిలో జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్, అంబేద్కర్ వాది జాడి అన్నరావు పాల్గొన్నారు.

పీఎంపీఎఫ్ స్లిప్పులు అందించాలి



నవతెలంగాణ-రెబ్బెన

22022-23కు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన సీఎంపీఎఫ్ స్లిప్పులను అందజేయాలని ఖైర్‌గూడ ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఖైర్‌గూడ ఓపెన్ కాస్ట్ గోలేటి సీహెచ్‌పీ, ఏరియా వర్క్ షాప్ కార్మికులతో కలిసి సీఎంపీఎఫ్ సమస్యలపై అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి ఏరియా కార్మికులకు 2022-23 సంబంధించిన సీఎంపీఎఫ్ స్లిప్పులను అందజేయాలని, కార్మికులు రుణాలకు దరఖాస్తు చేసుకొని నెలలు గడుస్తున్న క్లియర్ కాక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. సమస్యలపై అధికారులు స్పందించి పరిష్కరించాలని కోరారు కార్యక్రమంలో ఏఐటీయూసీ ఆర్గనైజింగ్ సెక్రటరీలు జూపాక రాజేష్, కే కిరణ్ బాబు, శేషు దేవరకొండ దివాకర్, పిట్ కార్యాదర్శుల ఎంబడి రామయ్య, కోడం అశోక్, ఫిట్ సహాయ కార్యదర్శి ఎం ఓదెలు, సేఫ్టీ కమిటీ మైన్స్ కమిటీ సభ్యులు కే నరేష్, ఆవుల మల్లేష్, గోపాల్, సుధాకర్ పాల్గొన్నారు

నీట్‌లో కాగజ్‌నగర్ విద్యార్థి ప్రతిభ

నవతెలంగాణ-కాగజ్‌నగర్



నీట్-2024 జాతీయ స్థాయిలో జరిగిన పోటీ పరీక్షలో కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన మేడి చంద్ర కిరణ్ 522 మార్కులతో ఎంబీబీఎస్‌లో సీటు సాధించాడు. నీట్ పరీక్షలో 10172 ర్యాంక్ సాధించిన చంద్ర కిరణ్ చిన్ననాటి నుంచి డాక్టర్ అవడమే లక్ష్యంగా చదివాడు. చంద్ర కిరణ్ తల్లిదండ్రులు మేడి చరణ్ దాస్, వసంత ఇద్దరు కూడా స్కూల్ అసిస్టెంట్‌లుగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నారు. వీరి కూతురు మేడి చందన ప్రస్తుతం ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ హైదరాబాద్‌లో చదువుతోంది. పిల్లలు ఇద్దరు చిన్ననాటి నుండి క్రమశిక్షణతో చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించడం పట్ల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆసిఫాబాద్‌లో కాంగ్రెస్ హవా

- బీఆర్ఎస్ ఓట్లు బీజేపీకి బదిలీ
- 21 రౌండ్లలో సత్తా చాటిన అధికార పార్టీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడగా అందుల్లో ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఆసిఫాబాద్‌లో అధికార కాంగ్రెస్ 23 రౌండ్లకు గాను 21 రౌండ్లలో సత్తా చాటింది. ఎమ్మెల్యే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటు బ్యాంకు బీజేపీకి మళ్లినట్లు కన్పించింది.

ఆసిఫాబాద్‌లో కాంగ్రెస్ హవా

పార్లమెంట్ ఎన్నికల్లో ఆసిఫాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ హవా కొనసాగింది. బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థుల కంటే కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ 26940 మెజారిటీ సాధించి కాంగ్రెస్ హవా చాటింది.

బీఆర్ఎస్ ఓట్లు బీజేపీకి బదిలీ



గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆసిఫాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మికి 82951 ఓట్లు రాగా, బీజేపీకి 6554 ఓట్లు వచ్చాయి. ప్రస్తుతం బీఆర్ఎస్‌కు 38597 ఓట్లు రాగా, బీజేపీకి 47056 ఓట్లు వచ్చాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు పడ్డ ఓట్లు ప్రస్తుతం మోడీ మానియాతో బీజేపీకి పడ్డట్టు తెలుస్తోంది. ఎమ్మెల్యే కోవ లక్ష్మీ బీఆర్ఎస్ గెలుపు బాధ్యతలు భుజాన వేసుకోని ప్రచారం చేసినప్పటికీ ఓట్లు బదిలీ కాకుండా కాపాడలేకపోయింది. బీఆర్ఎస్ బదిలీ కావడంతో ఆ పార్టీ చతికిలపడిపోయింది.

రౌండ్‌ల వారీగా పార్టీలు సాధించిన ఓట్లు

23 రౌండ్లలో ఓట్లు లెక్కించగా 21 రౌండ్లు కాంగ్రెస్ ఆదిత్యం సాధించగా రెండు రౌండ్లలో మాత్రమే 9వ రౌండ్‌లో బీఆర్ఎస్, 11వ రౌండ్‌లో బీజేపీ ఆదిత్యం సంపాదించాయి. మొత్తం మీద ఆసిఫాబాద్ నియోజకవర్గంలో పోలైన ఓట్లలో బీఆర్ఎస్‌కు 38597, కాంగ్రెస్‌కు 73,996, బీజేపీకి 47056 ఓట్లు వచ్చాయి.

రౌండ్ నెంబరు	బీఆర్ఎస్	కాంగ్రెస్	బీజేపీ
01	960	3674	3489
02	1185	3368	3052
03	1447	3052	2467
04	1907	3016	1760
05	1750	4876	2638
06	1567	3128	2561
07	1656	3214	1375
08	1358	3002	2440
09	1942	1697	1684
10	1830	3727	1489
11	1845	2418	3575
12	2749	2944	673
13	2171	2146	691
14	1285	4128	4276
15	1337	4558	2138
16	1630	2549	1781
17	1541	4204	1896
18	1477	3314	2078
19	2509	4135	1908
20	2174	3373	1886
21	1927	3653	1469
22	1760	3185	1645
23	590	675	187

పార్లమెంట్ ఎన్నికలపై సర్వత్రా ఉత్కంఠ

- టీవీలకు అతుక్కుపోయిన జనం
- బోసిపోయిన పట్టణం
- బస్టాండ్‌లో ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పార్లమెంట్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో జిల్లాలో సర్వత్ర ఉత్కంఠ నెలకొంది. గత డిసెంబర్ నెలలో విడుదలైన అసెంబ్లీ ఫలితాల్లో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ గెలిచి ప్రభుత్వం ఏర్పడగా జిల్లాలో మాత్రం వ్యతిరేక ఫలితాలు వచ్చాయి. అయితే పార్లమెంట్ ఎన్నికల్లో అయిన కాంగ్రెస్ ఫలితాలు అనుకూలంగా రావడానికి శ్రేణులు పడ్డ కష్టాలపై ప్రజలు, నాయకుల్లో ఆలోచన ఉండేది. మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ఫలితాలపై చర్చ జరిగింది.

అంతటా ఉత్కంఠ

మంగళవారం జిల్లాకు చెందిన ఓట్లను ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కౌంటింగ్ ప్రక్రియ చేపట్టినప్పటికీ జిల్లాలో అంతట ఉత్కంఠగా మారింది. ఉదయం నుండి ప్రజలు టీవీల వద్ద అతుక్కుపోగా, ఫలితాల కోసం ఆసక్తిగా ఎదురు చూడడం కనిపించింది.

ప్రతి నోట ఫలితాల మాట

పార్లమెంట్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో జిల్లా కేంద్రంలో ప్రతి నోట ఫలితాల మాట వినిపించింది. చిన్నవారి నుండి పెద్దవారి వరకు ఫలితాలపై ప్రత్యేకంగా మాట్లాడుకున్నారు. ఏ పార్టీ వస్తే ఏం జరుగుతుందనేదనే చర్యలు జోరుగా సాగాయి. మొత్తం మీద రెండు నెలల నుంచి సాగుతున్న ఉత్కంఠకు తెరపడింది.

బోసిపోయిన పట్టణం

పార్లమెంట్ ఫలితాలు నేపథ్యంలో ఉదయం నుంచి అందరూ టీవీల వద్ద ఉండడంతో జిల్లా కేంద్రం బోసిపోయింది. ప్రతిరోజు పట్టణంలోని కూరగాయల మార్కెట్ రద్దీగా ఉండగా మంగళవారం అదేది లేకుండా పోయింది. కూరగాయలు అమ్మేవారు కూడా సెల్ ఫోన్‌లో ఫలితాలు చూస్తూ కనిపించారు. అందరూ ఫలితాల వైపు మొగ్గు చూపడంతో పట్టణ రహదారులు, రద్దీ ప్రాంతాలు జనాలు లేక బోసిపోయాయి.

ఆర్టీసీ బస్టాండ్‌లో ఎల్ఈడీ ఏర్పాటు

జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యం ఆర్టీసీ అధికారులు పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు చూడడానికి ఎల్ఈడీ ఏర్పాటు చేశారు. దీంతో పెద్ద ఎత్తున ప్రయాణికులు అక్కడికి చేరుకొని వీక్షించారు. ఎల్ఈడీ ఏర్పాటు చేయడంతో బస్టాండ్ ప్రాంతం ఫలితాల కోసం చూసే వారితో నిండింది.

సిర్పూరులో బీజేపీదే ఆధిక్యం

- గెడం నగేష్‌కు 8,369 ఓట్ల మెజార్టీ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఆదిలాబాద్‌లో మంగళవారం నిర్వహించిన లోక్‌సభ ఎన్నికల ఫలితాలలో సిర్పూరు నియోజకవర్గంలో బీజేపీ ఆధిక్యత సాధించింది. ఆరు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో మొదటి సారిగా ఈ నియోజకవర్గంలో విజయం సాధించిన కమలం, ప్రస్తుతం జరిగిన లోక్‌సభ ఎన్నికలలో కూడా తన ఆధిక్యాన్ని కనబర్చింది. ఆదిలాబాద్‌లోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో సిర్పూరు నియోజకవర్గ ఎన్నికల కౌంటింగ్ ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమైంది. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి దీపక్‌తివారి సమక్షంలో ఈ కౌంటింగ్ నిర్వహించారు. ఈ నియోజకవర్గంలో 2,29,101 ఓట్లు ఉండగా, గత నెల13న జరిగిన ఎన్నికలలో 1,63,944 ఓట్లు పోలైన విషయం తెల్సిందే. ఇందులో బీజేపీ అభ్యర్థి గెడం నగేష్‌కు 71,325 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణకు 62,956 ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కుకు 19,840 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణపై బీజేపీ అభ్యర్థి గెడం నగేష్ 8,369 ఓట్లు ఆధిక్యం కనబర్చారు.

రౌండ్ల వారీగా మెజార్టీ వివరాలు

రౌండ్లు	పార్టీ	ఆధిక్యం	ఆధిక్యంలో ఉన్న మొత్తం
01	బీజేపీ	3,105	3,105 (బీజేపీ)
02	బీజేపీ	5,611	8,716 (బీజేపీ)
03	బీజేపీ	246	8,962 (బీజేపీ)
04	బీజేపీ	1,197	10,159 (బీజేపీ)
05	బీజేపీ	465	10,624 (బీజేపీ)
06	కాంగ్రెస్	965	9,659 (బీజేపీ)
07	కాంగ్రెస్	728	8,931 (బీజేపీ)
08	కాంగ్రెస్	1,105	7,826 (బీజేపీ)
09	కాంగ్రెస్	1,066	6,760 (బీజేపీ)
10	బీజేపీ	750	7,510 (బీజేపీ)
11	కాంగ్రెస్	124	7,386 (బీజేపీ)
12	కాంగ్రెస్	357	7,029 (బీజేపీ)
13	కాంగ్రెస్	1,432	5,597 (బీజేపీ)
14	కాంగ్రెస్	407	5,190 (బీజేపీ)
15	బీజేపీ	2,195	7,385 (బీజేపీ)
16	కాంగ్రెస్	520	6,865 (బీజేపీ)
17	కాంగ్రెస్	650	6,215 (బీజేపీ)
18	బీజేపీ	867	7,082 (బీజేపీ)
19	కాంగ్రెస్	303	6,779 (బీజేపీ)
20	కాంగ్రెస్	254	6,545 (బీజేపీ)
21	బీజేపీ	892	7,437 (బీజేపీ)
22	బీజేపీ	153	7,570 (బీజేపీ)
23	బీజేపీ	799	8,.369 (బీజేపీ)



కౌంటింగ్ సిబ్బందికి సూచనలిస్తున్న సిర్పూరు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి దీపక్ తివారి



నగేష్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్

మొదటి ఐదు రౌండ్లలోనే 10 వేలకు పైగా బీజేపీకి ఆధిక్యం

కాగా మొదటి ఐదు రౌండ్ల ఓట్ల లెక్కింపులోనే బీజేపీ అభ్యర్థి గెడం నగేష్‌కు 10 వేలకుపైగా ఓట్ల ఆధిక్యం వచ్చింది. మొదటి రౌండ్‌లో 3,105, రెండో రౌండ్‌లో 5,611, మూడో రౌండ్‌లో 246, నాలుగో రౌండ్‌లో 1,197, ఐదో రౌండ్‌లో 465 ఓట్ల ఆధిక్యం రాగా ఐదో రౌండ్ ముగిసేసరికి బీజేపీ అభ్యర్థి గెడం నగేష్ సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థిపై 10,624 ఓట్ల ఆధిక్యం కనబర్చారు. తర్వాత ఆరు నుండి తొమ్మిదో రౌండ్ వరకు కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ ఆధిక్యత కనబరుస్తూ రావడంతో తొమ్మిదో రౌండ్ అనంతరం బీజేపీ మెజార్టీ 6,760కు తగ్గింది. పదో రౌండ్‌లో బీజేపీ, 11, 12, 13, 14 రౌండ్లలో కాంగ్రెస్, 15వ రౌండ్‌లో బీజేపీ, 16, 17 రౌండ్లలో కాంగ్రెస్, 18 రౌండ్‌లో బీజేపీ, 19, 20 రౌండ్లలో కాంగ్రెస్, 21, 22, 23 రౌండ్లలో బీజేపీ ఆధిక్యం కనబర్చింది. కాగా మొదటి ఐదు రౌండ్లలో వచ్చిన పది వేలకు పైగా మెజార్టీనే చివరి వరకు కొనసాగింది. కొన్ని రౌండ్లలో కాంగ్రెస్ ఆధిక్యం కనబరుస్తూ వచ్చినా అది మొదట్లో బీజేపీకి వచ్చిన ఆధిక్యాన్ని తగ్గిస్తూ వచ్చిందే తప్ప కాంగ్రెస్‌కు పైచేయిని సాధించి పెట్టలేకపోయింది.

నగేష్‌ను అభినందించిన నాయకులు

ఎంపీగా విజయం సాధించిన అనంతరం ఆ పార్టీకి చెందిన కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా నాయకులు ఆదిలాబాద్‌లో నగేష్‌ను కలిసి అబినందించారు. సిర్పూరు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబుతో పాటు బీజేపీ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనివాస్ తదితరులు నగేష్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.



ఏజెంట్ల సమక్షంలో సిర్పూరు ఓట్లను లెక్కిస్తున్న సిబ్బంది

జన సైనికుల సంబరాలు



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల ఫలితాల్లో జనసేన పార్టీ విజయం సాధించడం పట్ల సిర్పూర్ నియోజకవర్గ జనసేన ఆధ్వర్యంలో మంగళవారం సంబరాలు జరుపుకున్నారు. కేక్ కట్ చేసి స్వీట్స్ పంచుకొని టపాకాయలు పేల్చి విజయోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

స్నేహితుని కుటుంబానికి చేయూత



నవతెలంగాణ-దండేపల్లి

మండల కేంద్రానికి చెందిన వేమనూరు సత్యనారాయణ భార్య కమల ఇటీవలే ఉపాధి హామీ పనులకు వెళ్లి వస్తు ట్రాలీ బోల్తా పడిన ఘటనలో తీవ్ర గాయాలపాలవగా ఆయన మిత్రులు సత్యనారాయణ కుటుంబానికి అండగా నిలిచారు. ఆయన తోపాటు పదవ తరగతి వరకు చదువుకున్న తోటి మిత్రులు రూ.32 వేల ఆర్థిక సాయం వైద్య ఖర్చుల నిమిత్తం అందజేశారు. ఆపద సమయంలో ఆదుకొని మేమున్నామంటూ స్నేహం విలువ చాటారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు. ఆపదలో ఉన్నప్పుడు ఆదుకున్నవానే నిజమైన ఆప్తులని వారిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దండేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1998-99 పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా గెలుపొందిన అరవిందర్‌రెడ్డి అల్లుడు

నవతెలంగాణ-మంచిర్యాల



మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవిందర్‌రెడ్డి చిన్న కూతురు భర్త పుట్ట కృష్ణ చైతన్యరెడ్డి కమలాపూర్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడ్డయి. అయన కడప జిల్లా కమలపూర్ నియజకవర్గ ఎమ్మెల్యేగా టీడీపీ నుంచి మొదటి సారి గెలుపొందారు. తన ప్రత్యర్థి అయిన వై ఎస్ఆర్ సీపీ అభ్యర్థి రవీందర్‌రెడ్డిపై 24600 ఓట్ల మెజారిటీతో గెలుపొందడంతో అరవిందర్‌రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. తన కుటుంబ సభ్యులతో కలిసి సంతోషాన్ని పంచుకున్నారు.

పెద్దపల్లి ఎంపీ స్థానం కాంగ్రెస్ వశం

- లక్షా31 వేల ఓట్ల మెజారిటీతో వంశీ గెలుపు
- మంచిర్యాల జిల్లాలో 69679 ఓట్ల మెజారిటీ
- మూడో స్థానానికి పరిమితమైన బీఆర్ఎస్
- పట్టణ ప్రాంతంలో బీజేపీకే మొగ్గు చూపిన ఓటర్లు
- అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే భారీగా తగ్గిన మెజారిటీ

నవతెలంగాణ-హాజీపూర్

పెద్దపల్లి ఎంపీ అభ్యర్థిగా కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ భారీ మెజారిటీతో గెలుపొందారు. పెద్దపల్లి పార్లమెంటు పరిధిలో 7 నియోజకవర్గాలు ఉండగా ఇందులో మంచిర్యాల జిల్లా పరిధిలో చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల నియోజకవర్గాలు ఉన్నాయి. ఇవీ కాక పెద్దపల్లి జిల్లా పరిధిలోని మంథనీ, రామగుండం,పెద్దపల్లి, ధర్మపురి నియోజక వర్గాలు ఉన్నాయి. 7 నియోజకవర్గాల పరిధిలో 15,96,430 ఓట్లు ఉండగా గత నెల 13న జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ,10,83,453 ఓట్లు పోలయ్యాయి. 42 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఇందులో ప్రధాన పార్టీలు అయిన బీఆర్ఎస్ నుంచి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, కాంగ్రెస్ నుండి గడ్డం వంశీ కృష్ణ, బీజేపీ నుంచి గోమాస శ్రీనివాస్‌లు భరిలో నిలిచారు. కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీ 1,31,581 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

మంచిర్యాల జిల్లాలో 69,679 వేల మెజారిటీ..

పెద్దపల్లి పార్లమెంటు పరిధిలో మంచిర్యాల జిల్లాలోని చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల నియోజకవర్గాలు ఉన్నాయి. చెన్నూర్‌లో 1,93,778 ఓట్లు ఉండగా 1,32,787 ఓట్లు పోలయ్యాయి. బెల్లంపల్లిలో 1,76,514 ఓట్లకు 1,25,255 ఓట్లు పోలయ్యాయి. మంచిర్యాల సెగ్మెంట్‌లో 2,78,738 ఓట్లకు గాను 1,69,591 ఓట్లు పోలయ్యాయి. ఇందులో చెన్నూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు 26,743 ఓట్లు రాగా



కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు 59,489 మంది ఓట్లు వేశారు. బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌కు 33,775 ఓట్లు వచ్చాయి. ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి సమీప బీజేపీ అభ్యర్థిపై 25,714 ఓట్ల మెజారిటీ సాధించారు. బెల్లంపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు 22453 ఓట్లు, కాంగ్రెస్‌కు 57157, బీజేపీకి 32577 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి బీజేపీపై 24580 ఓట్ల మెజారిటీ సాధించారు. ఎక్కువ ఓట్లు ఉన్న మంచిర్యాల లో బీఆర్ఎస్ అభ్యర్థికి 21614, కాంగ్రెస్ 79101, బీజేపీకి 59716 ఓట్లు వచ్చాయి. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి 19385 ఓట్ల మెజారిటీ సాధించారు. మొత్తంగా చూస్తే మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా మూడు నియోజకవర్గాల్లో కలిపి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు 69679 ఓట్ల మెజారిటీ వచ్చింది.

శాసనసభ ఎన్నికలతో పొలిస్తే మెజారిటీ తక్కువే

శాసనసభ ఎన్నికలతో పోలిస్తే కాంగ్రెస్‌కు మంచిర్యాల జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో మెజారిటీ తగ్గిందని చెప్పవచ్చు. మూడు నియోజకవర్గాల్లో భారి మెజారిటీతో ఎమ్మెల్యేలు గెలుపొందగా ఈ ఎన్నికల్లో తగ్గాయి. మంచిర్యాల నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్‌పై 37,541 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. పార్లమెంటు ఎన్నికల్లో తన తనయునికి మాత్రం ఇక్కడ 25714 ఓట్ల మెజారిటీ మాత్రమే వచ్చింది. ఇక బెల్లంపల్లిలో గడ్డం వినోద్ బీఆర్ఎస్ అభ్యర్థి దుర్గం చిన్నయపై 36,878 ఓట్ల మెజారిటీ సాదించారు. కానీ పార్లమెంటు ఎన్నికలు వచ్చే సరికి ఆ మెజారిటీ కాస్త తగ్గి 24580కి పడిపోయింది. జిల్లాలో ఎక్కువ ఓట్లున్న మంచిర్యాల నియోజక వర్గం లో కాంగ్రెస్ అభ్యర్థి కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు సమీప బీజేపీ అభ్యర్థి వెరబెల్లి రఘునాథ్‌రావుపై 66416 ఓట్ల మెజారిటీతో గెలుపొందరు. పార్లమెంటు ఎన్నికల్లో కేవలం 19,385 ఓట్లే మెజారిటీ మాత్రమే వచ్చింది. మంచిర్యాల జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల్లో మూడు నియోజక వర్గాల్లో కలిపి కాంగ్రెస్ అభ్యర్థులకు 140835 ఓట్ల మెజారిటీ రాగ, ప్రస్తుత పార్లమెంట్‌లో మాత్రం కేవలం 69,679 ఓట్ల మెజారిటీ మాత్రమే వచ్చింది. మూడు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ మూడవ స్థానానికే పరిమితం అయింది. మూడు నియోజక వర్గాల్లో పట్టణ ప్రాంతాలు అయిన మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి, లక్షెట్టిపెట్, మందమర్రి, నస్పూర్‌లలో బీజేపీ గణనీయంగా పుంజుకుంది. కాంగ్రెస్ తో సమానంగా ఓట్లు సాధించింది.

సెక్యూరిటీగార్డుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణిలో సెక్యూరిటీగార్డ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, ఏరియా కార్యదర్శి ఎస్కే బాజీ సైదా అన్నారు. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ అండ్ పీసీ డిపార్ట్మెంట్లో పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలను పరిష్కారం చేయాలని శ్రీరాంపూర్ జీఎం బి సంజీవరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుదీర్ఘకాలం నుంచి ఎంటీఎఫ్ టీంలో చేస్తున్నటువంటి గార్డులను వెంటనే తీసివేసి వారి స్థానంలో కొత్త వారికి అవకాశం కల్పించాలని, అన్ని చెక్ పోస్టుల వద్ద కొత్త కుర్చీలను ఏర్పాటు చేయాలని, ఇందారం ఓపెన్ కాస్టులో కంటైనర్ చెక్‌పోస్టును తీసివేసి నూతన చెక్ పోస్టును ఏర్పాటు చేయాలని అన్నారు. గర్ల్స్ హాస్టల్ వద్ద సెక్యూరిటీ గార్డుకు వాష్ రూమ్ ఏర్పాటు చేయాలని, ఏరియా వర్క్ షాప్ ఇందారం గని గేటు వద్ద రెండవ గార్డును ఏర్పాటు చేయాలని, ఎస్ అండ్ పీసీ ఆఫీస్ వద్ద నైట్ షిఫ్ట్‌లో రాత్రి 9:00 నుండి ఉదయం 5 గంటల వరకు ఒక సెక్యూరిటీ గార్డ్‌ని ఏర్పాటు చేయాలన్నారు. కంప్యూటర్లు పనిచేసే చెక్ పోస్టల వద్ద ఏసీ సౌకర్యం కల్పించాలని, ఎంటీఎఫ్ టీంలో చేస్తున్న ప్రయివేటు సెక్యూరిటీ గార్డులను వెంటనే తొలగించాలన్నారు. శ్రీరాంపూర్ సీహెచ్పీ, ఎస్ఆర్పీ ఓసీపీ చెక్ పోస్ట్ వద్ద లారీ నెంబర్ కనబడుట కొరకు మానిటర్ డిస్ప్లేను ఏర్పాటు చేయాలన్నారు.సెక్యూరిటీ సమస్యల మీద, సెక్యూరిటీ గురించి ప్రతి నెల అధికారికంగా గుర్తింపు సంఘం పిట్ కమిటీతో మీటింగ్ ఏర్పాటు చేయాలనీ తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిట్ కార్యదర్శులు ఆడెపు మల్లికార్జున్, గునిగంటి నరసింహారావు, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, నాయకులు సింహాచలం, అశోక్, సత్తయ్య, శంకర్, రాజేంద్రప్రసాద్, సదానందం, లక్ష్మయ్య, కళ్యాణ్, గోపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల విజయోత్సవ సంబరాలు

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని ముత్యంపల్లి గ్రామంలో పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ భారీ మెజార్టీతె గెలుపొందడంతో ముత్యంపల్లి కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. గెలుపుకు సహకరించిన ప్రజలకు, కార్యకర్తలకు, నాయకులకు, ప్రత్యేకంగా ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ముత్తంపల్లిలో బైక్ ర్యాలీ తీసి, టపాసులు పేల్చి సంబరాలు చేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల కాంగ్రెస్ యువ నాయకులు పుర్ర కుమారస్వామి యాదవ్, ముత్యంపల్లి కాంగ్రెస్ అధ్యక్షుడు ధారవేణి రాజన్న, ప్రధాన కార్యదర్శి రేషవేణి ఓదెలు, కోఆప్షన్ సిరాజ్ ఖాన్, బీసీ సెల్ ప్రెసిడెంట్ స్వామి, యూత్ ప్రెసిడెంట్ మారం రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శి పంబాల అరవింద్, రామ్మూర్తి, మారం సూరన్న, పొలగని మహేష్, బోయిని శ్రీనివాస్, పొలవెని పోషన్న, బోయిని మల్లేష్, మంద శ్రీనివాస్, బోయిని లక్ష్మణ్, రేషవేణి రాజు, పెంద్రం శంకర్, రవి పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు

నవతెలంగాణ-జైపూర్



పెద్దపల్లి పార్లమెంట్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా గడ్డం వంశీకృష్ణ గెలుపొందడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున్న సంబరాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫయాజోద్దీన్, మంచిర్యాల జిల్లా కార్యదర్శి రిక్కుల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో టపాసుల పేల్చారు. అదేవిధంగా భీమారం మండల కేంద్రంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయానికి చేరుకున్న నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యకమంలో ఉమ్మడి మండలానికి చెందిన తాజా మాజీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సీఎం పీఎఫ్ స్లిప్పులు అందజేయాలి



నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి ఏరియా కార్మికులకు 2022-23 సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన సీఎం పీఎఫ్ స్లిప్పులను అందజేయాలని ఏఐటీయూసీ ఏరియా వర్క్ షాప్ పిట్ కార్యదర్శి అశోక్ కోరారు. ఆయన మంగళవారం ఫిట్ ఇంజనీర్ నరేష్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు సీఎం పిఎఫ్ లోన్స్‌కు అప్లై చేసుకొని నెలల తరబడి వేచి చూస్తున్నారని తెలిపారు. సిఎంపీఎఫ్ రుణాలు మంజూరు కాకపోవడంతో బయట వడ్డీలకు తెచ్చి ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కార్మికుల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని యాజమాన్యం సత్వర చర్యలు తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఆయనతో సేఫ్టీ కమిటీ సభ్యులు, మాదవరెడ్డి, శ్రీనివాస్ ఉన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రయివేట్ వ్యక్తుల మార్కెటింగ్



నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రయివేట్ మార్కెటింగ్ ఉద్యోగులు, బ్యాంకు, ప్రయివేట్ ఏజెంట్‌ల తాకిడి రోజు రోజుకు పెరిగిపోతుంది. తమ బిజినెస్‌లను పెంచుకోవడానికి ఏకంగా ప్రభుత్వ ఆస్పత్రిలో విదులు నిర్వహించే వారిని కలిసి వివరాలు తెలిపేందుకు వస్తున్నారు. కొందరు ప్రయివేట్ ఉద్యోగులు రోగులతో పాటు ఆస్పత్రి ఆవరణలో కనిపిస్తున్నారు. విదుల్లో ఉన్న వైద్యులతో కలిసి విధులకు ఆటంకం కలిగించేలా చర్చిస్తు కనిపించింది. గతంలో సూపర్ మార్కెట్‌లలో పని చేసే ప్రయివేట్ పర్సన్స్ కూడా వచ్చి డాక్టర్‌ల వివరాలు కనుక్కొని వెళ్లారు. తాజగా మంగళవారం మంచిర్యాలలో ఇటీవల పెద్ద మొత్తంలో ఓపెన్ చేసిన ఒక 3 స్టార్ హోటల్‌లో పని చేసే ఏజెంట్స్ వచ్చి డాక్టర్ లకు స్పెషల్ ప్యాకేజీలు ఉన్నాయంటు, వారి వెంట తెచ్చుకున్న అప్లికేషన్ ఫార్మ్‌లో డాక్టర్‌ల వివరాలు నమోదు చేసుకొని ప్యాకెజీల వివరాలు వెల్లడించి వెళ్లారు. రోగులతో బిజీగా ఉండే సమయంలో ఇలాంటి ప్రయివేట్ వ్యక్తులు మార్కెటింగ్ కోసం అని వచ్చి ఉన్న కాసింత సమయాన్ని వృథా చేస్తున్నారని పలువురు వైద్యులే ఆరోపిస్తున్నారు. ఎటువంటి ప్రయివేట్ వక్తులు హాస్పిటల్‌లోనికి వచ్చి మార్కెటింగ్ చేసేందుకు అనుమతులు ఇవ్వలేదని, గతంలో ఒక సంస్థ నిర్వాహకులు ఇదే పని కోసం అనుమతి తీసుకునేందుకు ప్రయత్నిస్తే హాస్పిటల్ ఆవరణలోకి రాకుండా హాస్పిటల్ బయట ఏదైనా చేసుకోండి కానీ హాస్పిటల్‌లోకి వచ్చి డ్యూటీలో ఉన్న డాక్టర్‌లను ఇబ్బంది పెట్టొద్దని వారికీ తెలిపినట్లు హాస్పిటల్ సూపరిండెంట్ హరీష్ చంద్రరెడ్డి తెలిపారు. ప్రయివేట్ మెడికల్ ఏజెంట్స్‌ను కూడా లోపలికి అనుమతిస్తలేమని, ఎవరికీ తెలియకుండా కొందరు హాస్పిటల్‌లోకి వచ్చి ఇలా మార్కెటింగ్ చేస్తున్నారని, ఇలాంటివి భవిష్యతులో జరగకుండా పర్యవేక్షణ చేస్తామని తెలిపారు.

బీజేపీ సంబరాలు అడ్డుకున్న పోలీసులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అటు దేశంలో ఇటు ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థులు గెలవడంతో జిల్లా కేంద్రంలో బీజేపీ శ్రేణులు సంబరాలు నిర్వహించాయి. దీనిలో భాగంగా జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద టపాసులు పేల్చే సమయంలో పట్టణ సీఐ సతీష్ అక్కడికి చేరుకొని వారిని నివారించే ప్రయత్నం చేశారు. ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో ముందుగానే ఎటువంటి సంబరాలకు అనుమతి లేదని పోలీసులు తెలిపినట్లు వారికి వివరించారు. నిబంధనలు ఉల్లంఘించకూడదని అలా చేస్తే ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కేసులు పెట్టాల్సి ఉంటుందని వారికి వివరించారు. కొద్దిసేపు పోలీసులకు బీజేపీ శ్రేణులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. అనంతరం శ్రేణులు టపాసులు అంటించి అక్కడి నుండి వెళ్లిపోయారు.

ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటాం



నవతెలంగాణ-జన్నారం

ఆపదలో ఉన్న వారిని ఆదు కోవడానికి బీఆర్ఎస్ నాయకులు ముందుటారని బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి బుక్య జాన్సన్ నాయక్ అన్నారు. మండలంలోని కలమడుగులో బలమైన ఈదురుగాలులతో పాటు కురిసిన వర్షంతో ఇంటి పైకప్పులు లేచిపోయి అనాథలైన రాజన్న శ్యామల ఇంటికి జాన్సన్ నాయక్ వెళ్లి జరిగిన సంఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. వెనుక ముందు గుంటెడు భూమి లేక కూలి నాలి చేసుకొని పొట్టపోసుకుంటున్న తాము బలమైన ఈదురు గాలులతో ఇంటి పైకప్పు లేచిపోవడంతో అనా థలమయ్యామని, తమను ఆదుకోవాలని విలపించారు. స్పందించిన జాన్సన్ నాయక్ అధైర్యపడవద్దని తాము అండగా ఉండి ఆదుకుంటామని భరోసా కల్పించారు. పేదలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కలమడుగు గ్రామ పంచాయతీకి చెందిన తాండలో ఫకీర్ నాయక్ అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, ఫజల్‌ఖాన్, మండల ప్రధాన కార్యదర్శి చులువ జనార్దన్, తాళ్లపెల్లి రాజేశ్వర్, యాద గిరి స్వదేశ్‌రావు, జంగంపెల్లి సంతోష్ ఉన్నారు.

కాకా వారసుడొచ్చాడు..!

- లోక్‌సభలో అడుగిడనున్న మనుమడు
- పెద్దపల్లి ఎంపీగా గడ్డం వంశీకృష్ణ ఘన విజయం



నవతెలంగాణ-జైపూర్

ఓట్ల లెక్కింపుకు ముందే పెద్దపల్లిలో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ గెలుపు ఖాయమని తేలిపోయింది. కాంగ్రెస్ కురువృద్ధుడు పెద్దపల్లి మాజీ ఎంపీ గడ్డం వెంకటస్వామి వారసునిగా పెద్దపల్లి ఓటర్లు వంశీకృష్ణను ఆశీర్వదించారు. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాలో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ పూర్తి చేసి ఇండస్ట్రీలిస్టుగా కొనసాగి కాక వారసునిగా రాజకీయ అరంగేట్రం చేశాడు. పెద్దపల్లి పార్లమెంట్ ప్రతినిధిగా లోక సభలో అడుగు పెట్టబోతున్నాడు.

వ్యాపారవేత్తగా..

అమెరికాలో పర్డ్యూ విశ్వవిద్యాలయంలో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ చేసిన ఆయన పెన్నార్ ఇండస్ట్రీస్‌లో ఒక సంవత్సరం పాటు ప్రొఫెషనల్‌గా పని చేశారు. 21 సంవత్సరాల వయస్సులో మేనేజ్‌మెంట్ ట్రైనీగా చేరి తదుపరి విశాఖ ఇండస్ట్రీస్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా కంపెనీ వ్యాపారన్ని కొనసాగించారు. 15 సంవత్సరాల పాటు విశాఖ ఇండస్ట్రీస్ లిమిటెడ్ అసాధారణ రీతి టర్నోవర్‌తో వృద్ధికి కృషి చేశారు. కాగా యూఎస్ఏలో ఎలోన్ మస్క్‌పై ఏటీయూఎం సోలార్ రూఫ్ అనే విప్లవాత్మక ఉత్పత్తితో పేటెంట్‌లను సొంతం చేసుకున్నాడు. అదేవిధంగా ఎలక్ట్రికల్ బైక్ కంపెనీ ఆటో మొబైల్‌ను ఏర్పాటు చేసి 500 మందికి మించి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించారు.

రాజకీయ నేపథ్యం ..

కాక వెంకటస్వామి కుటుంబం నుండి వచ్చిన వంశీకృష్ణ ఏఐసీసీ సభ్యునిగా ఉన్న కాక వెంకటస్వామి వారసునిగా చెప్పుకుని రాజకీయాల్లోకి వచ్చారు. అదేవిధంగా చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి కుమారుడైన వంశీకృష్ణ గతంలో తన తాత వెంకటస్వామి, తన తండ్రి వివేక్ ప్రాతినిధ్యం వహించిన పెద్దపల్లి పార్లమెంట్ స్థానం నుండి తాత, తండ్రి వారసత్వాన్ని కొనసాగించడానికి నిర్ణయించుకున్నాడు. ప్రస్తుత బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వంశీకృష్ణ పెద్ద తండ్రి కాగా కుటుంబ నేపథ్యం అంతా రాజకీయాలతో ముడిపడివుండటంతో ఆయన కూడా రాజకీయాల ద్వార ప్రజలతో కలిసిపోవడానికి మొగ్గు చూపారు.

సామాజిక సేవ పట్ల మక్కువ

తాత వెంకటస్వామి తండ్రి వివేక్ వెంకటస్వామి అడుగుజాడల్లో సామాజిక సేవ పట్ల మక్కువ పెంచుకున్నారు. అనారోగ్య, అంగవైకల్యం కలిగివున్న వారికి కృత్రిమ అవయవాలు అందజేయడం, కంటి సమస్యల వారికి ఉచిత వైద్య శిభిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించగలిగారు. అంతే కాకుండా పాఠశాల విద్యార్థు అవసరాలు తీర్చడంలో పాఠశాలల్లో కనీస మౌళిక వసతుల కల్పనకు తన వంతు తోడ్పాటు అందించాడు. ఈ క్రమంలో పర్నీచర్, పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణం, ప్రభుత్వ ఏయిడెడ్ పాఠశాలల్లో అదనంగా నియమించుకున్న ఉపాధ్యాయులకు జీత భత్యాలు చెల్లించడం, మహిళలకు కుట్టు మిషన్‌లో శిక్షణ ఇప్పించడం, వెనుకబడిన విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు, పేద విద్యార్థులకు ఉచిత భోజన వసతి కల్పించడం సామాజిక సేవ బాధ్యతగా నిర్వర్తించారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి ఇబ్బందులు పరిష్కరించడం కోసం బోర్‌వెల్స్ ఏర్పాటు ట్రాక్టర్ల ద్వార నీటి సరఫరా కొనసాగించిన వంశీకృష్ణకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

పట్టణంలో 33/11 సబ్ స్టేషన్ పనుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ టౌన్ ఏఈ కమలాకర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఓల్డ్ కాలనీ, స్టేషన్ రోడ్డు, పెట్రోల్ పంపు ఏరియా, సర్సిల్క్ కాలనీలకు సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉద్యోగులు సొంత వాహనాలతో రావాలి

నవతెలంగాణ-రెబ్బెన

ఖైర్‌గూడ సింగరేణిలో నడుస్తున్న కన్వేయన్స్ వాహనాల యాజమనులు డిమాండ్ల సాధనకు బుధవారం నుంచి సమ్మె చేపడుతున్నారనియ ఓసీపీ మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులు గనికి వెళ్ళేందుకు వారి సొంత ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
బుధవారం | జూన్ 05 , 2024 | www.navatelangana.com

బీజేపీ నాయకుల సంబరాలు

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



కేంద్రంలో ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రావడంతో మండలంలో బీజేపీ మండల అధ్యక్షులు జునుగారి మధుకర్ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. కార్యకర్తలు స్వీట్లు పంచుతూ గెలుపు నినాదాలు చేశారు. ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గోడం నగేష్ విజయం సాధించడం, కేంద్రంలో అధికారం రావడంతో జిల్లా మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.

కౌటాల : సార్వత్రిక ఎన్నికల్లో ఆదిలాబాద్ ఎంపీగా బీజేపీ అభ్యర్థి గోడం నగేష్ విజయం సాధించడంతో పార్టీ మండల స్థాయి నాయకులు మండల కేంద్రంలోని కుమురం భీం చౌరస్తా వద్ద టపాకాయలు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

పట్టణంలో టీడీపీ నాయకుల సంబరాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



తెలుగుదేశం, జనసేనా, బీజేపీ కూటమి ఆంధ్రప్రదేశ్‌లో ఘన విజయం సాధించిన సందర్భంగా ఆదిలాబాద్ తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా సంబరాలను జరుపుకున్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో టపాసులు కాలుస్తూ స్వీట్లు తినిపించుకున్నారు. గత ఐదు సంవత్సరాలుగా జగన్ పాలనలో ప్రజలు పడ్డ ఆవేదనను ఓటు రూపంలో చూపించారని నాయకులు అన్నారు. నారా చంద్రబాబు నాయుడును భారీ మెజారిటీతో గెలిపించుకొని, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కొరకు ఒక విజనరీ వ్యక్తి నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాత బాబు అని ప్రజలు నిర్ణయించుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ కార్యదర్శి ఆకుల రాము, పార్లమెంట్ కార్యదర్శి గంగసరపు ఓమన్న, లస్మన్న, అరె రాజన్న, వంశీ పాల్గొన్నారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి

నవతెలంగాణ-దండేపల్లి



క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని క్రీడలతో పాటు యువత అన్ని రంగాల్లో రాణించాలని సీనియర్ జర్నలిస్ట్ ముస్తఫా అన్నారు. తాళ్లపేటలో గ్రామస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించగా జన్నారం మండలం రాంపూర్ గ్రామం విజేతగా నిలిచింది. గెలిచిన జట్టుకు మొదటి బహుమతిగా రూ.ఐదు వేలు, రన్నర్ ఆఫ్ జట్టుకు రూ.రెండు వేల నగదు బహుమతిని అందజేశారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని మరింత పట్టుదలతో ఆడి ముందుకు సాగాలని రన్నర్‌అప్ జట్టుకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ షరీఫ్, స్థానిక నాయకులు ముస్తఫా, సల్లు, కంది రాకేష్, సందెల వంశీ, మహేష్, అఫ్రోజ్ పాల్గొన్నారు.

ప్రపంచ అందాల కిరీటాన్ని సొంతం చేసుకున్న నిర్మల్ వైద్యురాలు

నవతెలంగాణ-నిర్మల్

ప్రపంచ అందాల పోటీల్లో నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ వైద్యురాలు చంద్రిక కిరీటాన్ని దక్కించుకున్నారు. ఢిల్లీలోని గురుగావ్‌లో జరిగిన మిసెస్ వరల్డ్ ఫైనల్ పోటీల్లో పాల్గొన్న డా.చంద్రిక ప్రపంచ అందాల కిరీటాన్ని సొంతం చేసుకున్నారు. 2024 సంవత్సరంలో నిర్వహించిన ఈ పోటీల్లో ప్రపంచ దేశాల నుంచి 140 మంది మహిళలు పాల్గొన్నారు. నిర్మల్ నుంచి పాల్గొన్న డాక్టర్ చంద్రిక మిసెస్ వరల్డ్ పోటీలో కిరీటాన్ని సొంతం చేసుకోవడం నిర్మల్ జిల్లాకి దక్కిన గౌరవం. డాక్టర్ చంద్రిక భర్త అవినాష్ నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులుగా పని చేస్తారు. వీరికి పిల్లలు కూతురు మహాలక్ష్మి, కుమారుడు సూర్య వర్ధన్ కృష్ణ ఉన్నారు. ఒకపక్క ఆస్పత్రిలో వైద్యురాలిగా, మరోపక్క పిల్లలకు తల్లిగా తన పాత్రను బాధ్యతగా పోషిస్తూనే మిసెస్ వరల్డ్ పోటీల్లో పాల్గొని విజయం సాధించడం పట్ల మంగళవారం పలువురు అభినందనలు తెలిపారు.